# పచ్చని జీవితాలలో సెజ్ చిచ్చు

## బలవంతపు భూసేకరణలో సమిధలైన అన్నదాతలు ☆ భూములూ పోయాయి.. పరిహారమూ అయిపోయింది

## పూలమ్మిన చోటే కట్టెలమ్మే దుస్థితి ☆ ఇదీ కాకినాడ ఎస్ఈజెడ్ బాధితుల పరిస్థితి

**ఆ ఇళ్లలో సంక్రాంతి కళ లేదు. ఆ కళ్లలో ఆనందపు ఛాయలు మచ్చుకైనా లేవు. పూలమ్మిన చోటే కట్టెలమ్మే పరిస్థితి దాపురించింది. నూర్పిళ్లు పూర్తి చేసుకుని ఇళ్లలో ధాన్యం బస్తాలను దొంతెరలుగా వేయాల్సిన ఆ రైతులు.. పక్క ఊళ్లకు వెళ్లి పాలెగాళ్లుగా మారుతున్నారు. పండగ వేళ పాడి పంటలతో తులతూగిన ఆ కుటుంబాలు ఇప్పుడు ఛిన్నాభిన్నమైపోయాయి. ఓ వైపు పంపా నది... మరోవైపు ఏలేరు కాల్వ, నడుమ పిఠాపురం బ్రాంచి కాలువ పారగా, ఏటా రెండు పంటలతో సిరులొలికించే భూములతో బంధం తెగిపోతోంది. తరతరాలుగా ఆ పుడమితల్లినే నమ్ముకుని వారంతా జీవనం సాగిస్తున్నారు. ఇలా తరతరాలుగా పెనవేసుకున్న అనుబంధాన్ని.. ఎస్ఈజెడ్ పేరుతో అధికారులు అంతం చేస్తున్నారు. గుండెలవిసేలా బక్కరైతులు రోదిస్తున్నా, ఏమాత్రం కనికరం లేకుండా బలవంతంగా భూముల నుంచి తరిమేస్తున్నారు. మరోవైపు ఏటా వచ్చే ఫలసాయానికి అలవాటుపడ్డ రైతులకు ఒక్కసారిగా లక్షలు చేతికి రావడంతో జీవన గమనం సమూలంగా మారిపోయింది. చెడు వ్యసనాలకు లోనై కొందరు.. విలాసాల వలలో చిక్కుకుని మరికొందరు వచ్చిన పరిహారాన్ని హారతి కర్పూరం చేసేసి చక్కని జీవితాన్ని నిలువునా కూల్చుకుంటున్నారు. వ్యవసాయం చేసిన చోటే కూలీలుగా మారుతున్నారు.**

రాజమండ్రి, కాకినాడ – న్యూస్‌టుడే

కాకినాడ ప్రత్యేక ఆర్థికమండలి వందలాది పేదరైతుల కుటుంబాల్లో విషాదం నింపుతోంది. పచ్చని కుటుంబాలను వీధుల పాలుచేస్తోంది. తరతరాలుగా భూములను సాగుచేసుకుంటున్న రైతులవద్దకు వెళ్లి 'వీటితో మీకు రుణం తీరింది. ఇక పొండంటూ' అధికారులు తరిమేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో రూ.10 లక్షలు పలికే ఎకరం భూమిని చట్టం పేరుచెప్పి కారుచౌకగా రూ.3 లక్షలకే లాక్కుంటున్నారు. కాదని ఎదిరిస్తే కోర్టుకీడుస్తామని, రూ.2 లక్షల కంటే దక్కదని, చివరకు జైలే గతంటూ బెదిరిస్తున్నారు. దీంతో ఎదురు నిలిచే ధైర్యంలేక అధికారులు ఇచ్చిన పరిహారం పుచ్చుకుని పెనవేసుకున్న పుడమితల్లి బంధాన్ని తెంచుకుంటున్నారు. పోనీ ఎకరాకు దక్కిన పరిహారంతో ఎక్కడైనా కొందామంటే కనీసం 30 సెంట్ల భూమి కూడా దొరకడం లేదు. దీంతో చేతిలో ఉన్న పచ్చనోట్లు వారి వైఖరిని మార్చేశాయి. ఉండేది గుడిసెల్లోనైనా డీవీడీలు, సెల్‌ఫోన్లు వంటి అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాలు.. మోటారు సైకిళ్ల



ఇవే చివరి వరి నాట్లు

ఇలా ఒకటేమిటి కంటికి కొత్తగా కనిపించే వస్తువులను కొనేశారు. తీరా ఉన్న సొమ్మంతా ఖర్చయిపోయాక ఏమి చేయాలో తెలియక నిస్సహాయంగా చూస్తున్నారు. ఇది ఏ ఒక్కరో ఇద్దరి దయనీయ పరిస్థితి కాదు.. కాకినాడ ఎస్ఈజెడ్ పేరుతో అధికారులు బలవంతంగా భూములు లాక్కోవడంతో తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లోని వాకదారి పేట, గోర్సపాలెం, శ్రీరాంపురం, పొన్నాడ ఇలా అనేక గ్రామాల్లో వందలాది మంది రైతులు ఇలాంటి దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

సెజ్ భూతం వల్ల భూమితో అనుసంధానంగా ఉండే పశుసంపద కూడా కనుమరుగవుతోంది. వ్యవసాయ పనులకోసం వినియోగించే ఎద్దులు, దున్నలను కసాయి కొట్లకు తోలేశారు. పాడికోసం పెంచే ఆవులను మేపేందుకు గడ్డిలేక తెగనమ్మారు. ప్రస్తుతానికి భూములనే కోల్పోయిన రైతులు మరి కొద్దిరోజుల్లో ఇళ్లనూ కోల్పోతామన్న బెంగతో బిక్కుబిక్కుమంటున్నారు. మరోవైపు అప్పుల వాళ్లు తమ బాకీలు వసూలు చేసుకునేందుకు రైతులపై సవారీ చేస్తున్నారు. భూములున్నప్పుడు మెతక వైఖరి అవలంబించిన రుణదాతలు.. ప్రస్తుతం బాణీ మార్చారు. పరిహారం వచ్చిన వెంటనే బ్యాంకుల వద్దే వడ్డీతో సహా తమకు రావాల్సిన మొత్తాన్ని వసూలు చేస్తున్నారు. దీంతో భూమీ పోయి, వచ్చిన పరిహారమూ అయిపోవడంతో బతుకుబండి ఎలా లాగించాలో తెలియక రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



ఈ వృద్ధురాలి పేరు దూలం పంపమ్మ. ఈమెకు అయిదుగురు ఆడపిల్లలు. రాత్రనక పగలనక శ్రమించి తనకున్న మూడెకరాల భూమిని కాపాడుకుంటూ వస్తోంది. కట్టుకున్నోడు కాలంచేసినా మొండి ధైర్యంతో ఈ భూమినే నమ్ముకుని ఇద్దరు పిల్లల పెళ్లిళ్లు చేసింది. ఎవరో వచ్చి భూములు తీసుకుంటే చూస్తూ ఊరుకోనని హెచ్చరిస్తోంది. తమకు కాసింత మందు పెట్టి చంపేసిన తర్వాత భూములు లాక్కోండని కన్నీళ్ల పర్యంతమైంది. ఇలాంటి పంపమ్మలెందరో భూములతో తమకున్న బంధాన్ని వదులుకోలేక ప్రాణాలైనా వదలడానికి సిద్ధపడుతున్నారు.

## మా గోడు వినండి...

### గోళ్ల నూకరాజు, వాకదారిపేట; తొండంగి మండలం



ఇతడో రెండెకరాల ఆసామి. దీనిపై ఆధారపడి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. పిల్లలు పెళ్లీడుకొచ్చారు. ఇంతలో సెజ్ భూతం ఆ భూమికి ఎసరుపెట్టింది. బక్కరైతులు భూములిచ్చారని, నువ్వూ ఇవ్వక తప్పదని అధికారులు అతడ్ని బెదిరించారు. ఉద్యోగాలిస్తామని ఆశ చూపారు. రూ.6 లక్షలిస్తామని చెప్పి రూ.5.75 లక్షలు చేతిలో పెట్టారు. విషయం తెలిసి అప్పులోల్లొచ్చారు. సగం ఎగరేసుకుపోయారు. మిగిలిన మొత్తం వైద్యానికి, ఇంటి అవసరాలకు ఖర్చయిపోయింది. ఇప్పుడారైతు బతుకుదెరువు కోసం తినుబండారాల దుకాణం నడుపుతున్నాడు. లాభం కంటే నష్టమే ఎక్కువ వస్తుండడంతో ఏంచేయాలో తెలీక తల పట్టుకుంటున్నాడు.

### పెద అప్పారావు, వాకదారిపేట, తొండంగి



ఈయనకు ఉన్నది ఎకరం భూమి. దీనిపైనే పదిమంది ఆధారం. ఎస్ఈజెడ్ పేరుతో అధికారులు ఈ భూమిని లాక్కుని రూ.3 లక్షలు చేతిలో పెట్టారు. వచ్చిన పరిహారంతో కూతురు వివాహం చేశాడు. ఇంకా నలుగురు ఆడపిల్లలు. వారినెలా పోషించి పెళ్లిళ్లు చేయాలో తెలియక ఆ రైతు కన్నీళ్ల పర్యంతమవుతున్నాడు. చివరకు వైద్యం చేయించుకోడానికి కూడా డబ్బు లేక సాయం కోసం ఎదురుచూస్తున్నాడు.

**వీరిద్దరేకాదు...** ఎందరో రైతుల కన్నీటి బాధలు ఎస్ఈజెడ్ బలవంతపు భూసేకరణ వెనుక దాగున్నాయి. ఒక్కొక్కరిది ఒక్కో దీనగాథ. కదిలిస్తే కన్నీటి వ్యథ. నిన్నటివరకు రారాజుల్లా బతికినవీరంతా ఇప్పుడు రోజుకూలీలయ్యారు. ఒకప్పుడు అందరికీ పని కల్పించిన వీరే ఇప్పుడు పని కోసం పాకులాడుతున్నారు. ఒక్క తొండంగి మండలంలోని వాకదారిపేట గ్రామంలోనే 450 ఎకరాల వ్యవసాయ భూములను సెజ్ పేరుతో బలవంతంగా సేకరించడంతో 300 రైతు కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నాయి. ఇప్పటివరకు వ్యవసాయ భూములనే బలవంతంగా తీసుకుంటున్న అధికారులు.. ఇప్పుడు నివాసాలపైనా గురిపెట్టారు. ఇప్పటికే సెజ్ పరిధిలోకి వచ్చే గ్రామాలకు ప్రభుత్వ అభివృద్ధి పథకాలను పూర్తిగా నిలిపివేశారు. అధికారుల దాష్టీకానికి పరాకాష్ఠగా రైతులను సాగునీటి సంఘాల ఎన్నికలకు కూడా దూరం చేశారు. 307 నంబరు చెరువు పరిధిలోని రైతుల ఓట్లను గుత్తగా రద్దు చేసి ఎన్నికల హక్కును కాలరాశారు. దీన్నిబట్టి చూస్తే ఎలాగైనా రైతులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి ఇళ్లు, వాకిలిని వదిలిపోయేలా చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

### ఇదీ నేపథ్యం

కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలికి మొత్తం 7,956 ఎకరాల భూసేకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో యు.కొత్తపల్లి మండలంలో 4,408 ఎకరాలు, తొండంగి మండలంలో 3,548 ఎకరాలు సేకరిస్తున్నారు. ఒక్క యు.కొత్తపల్లిలోనే ఇంతవరకు 3,000 ఎకరాలు సేకరించారు. తొండంగిలోను 3,200 ఎకరాల సేకరణ పూర్తయింది. ఇంతవరకు సేకరించిన భూమిలో అధికశాతం రెండుసార్లు వరి పండే భూములు, జీడిమామిడి, సరుగుడు తోటలు ఉన్నాయి. అసలు వీటిని సెజ్‌కు సేకరించబోమని మొదట్లో చెప్పిన అధికారులే... ఇప్పుడు బలవంతంగా బెదిరించి మరీ లాక్కున్నారు.

### భూములు కాదు.. ప్రాణాలే వదులుతాం

ఈ మాట ఒక్కరిది కాదు. ఏళ్లతరబడి మట్టి పిసికి పసిడి పండిస్తోన్న వేలాదిమంది పుడమిబిడ్డల గళమిది. ఏళ్లకు ఏళ్లు శ్రమించి.. కంటికి రెప్పలా భూములను కాపాడుకుని... దీన్నే జీవనాధారంగా బతుకున్న తమను భూముల నుంచి ఖాళీ చేయిస్తే ప్రాణాలు వదులుతామని ఘంటాపథంగా చెబుతున్నారు. అధికారులే కాదు ఎన్ని చట్టాలొచ్చినా... ఏంచేసినా తమ ప్రాణాలు తీసే భూములు తీసుకోవాలని కన్నీళ్ల పర్యంతమవుతూ గుండెల్లో బాధను వెళ్లగక్కుతున్నారు.